



విధానసౌధ పశ్చిమద్వారం వద్ద సిద్ధమవుతున్న ప్రత్యేక ర్యాంప్

సభా సమయం



● నేటి నుంచి శాసనసభ సమావేశాలు ● తొలిరోజు గవర్నర్ ప్రసంగం ● 7న ఆర్థికమంత్రి హోదాలో సీఎం బడ్జెట్ సమర్పణ ● ప్రతిపక్షాల చేతిలో పలు అస్త్రాలు



సీఎం, డీసీఎం మధ్య విభేదాలు..!

అధికార కాంగ్రెస్‌లోనూ గ్రూపు విభేదాలు తారస్థాయిలో ఉన్నాయి. కొత్త ఏడాది ప్రారంభమైనప్పటి నుంచి సీఎం సిద్ద రామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌ల మధ్య విభేదాలు ఉన్నాయి. డీకే శివకుమార్‌కు కేపీసీసీ అధ్యక్ష పదవితోపాటు డీసీఎం, జలవనరులశాఖ, బెంగళూరు నగరాభివృద్ధి శాఖ వంటి కీలకమైనవన్నీ ఆయన వద్దే ఉండడాన్ని పలువురు మంత్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రత్యేకించి సహకారశాఖ మంత్రి రాజణ్ణ ప్రతి విషయంలోనూ డీకే శివకుమార్‌ను ప్రశ్నిస్తున్నారు. ఇక మరో మంత్రి సతీశ్‌జార్కిహొళి త్వరలోనే పార్టీకి కొత్త అధ్యక్షుడు వస్తారన్నారు. ఇక డీసీఎం డీకే శివకుమార్ అధ్యక్షుడిగా ఒక పర్యాయం ముగియడంతో రెండుసార్లు ఎంపీగా కొనసాగి క్రియాశీలక రాజకీయాల్లో కొనసాగుతున్న తమ్ముడు డీకే సురేశ్‌కు పార్టీ అధ్యక్ష పదవిని వరింపచేసేలా ప్రయత్నాలు చేస్తున్నారు. సీఎం మార్పు రెండున్నరేళ్ల ఒప్పందం ఉందని ప్రతిపక్షాలు సహా పలువురు వ్యాఖ్యానిస్తున్నా కాంగ్రెస్ నేతలు ఎవరూ నోరు మెదపడం లేదు. ఇలా కాంగ్రెస్‌లో గ్రూపువిభేదాలు ఉన్నా శాసనసభలో సమైక్యంగా ఉంటారనే వాదనలు ఉన్నాయి.



తొలిరోజు గవర్నర్ ప్రసంగం

శాసనసభ సమావేశాలలో తొలిరోజు సోమవారం ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ ప్రసంగించనున్నారు. ఉదయం 10.45 గంటలకు రాజ్‌భవన్ నుంచి బయల్దేరే గవర్నర్ పశ్చిమ ప్రధాన ద్వారం నుంచి విధానసౌధ ప్రాంగణంలోకి చేరుకుని తూర్పుద్వారం గుండా అసెంబ్లీకి వెళ్తారు. 11 గంటలకు గవర్నర్ ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. శాసనసభ స్పీకర్, పరిషత్ సభాపతిలు సాదరంగా స్వాగతించి ఘనంగా వీడ్కోలు పలుకుతారు. ఆ తర్వాత గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపేలా కలాపాలు ఈనెల 6వ తేదీ వరకు కొనసాగుతాయి.
7న ఆర్థికమంత్రి హోదాలో సీఎం బడ్జెట్ సమర్పించనున్నారు.

బెంగళూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): కొత్త ఏడాదిలో తొలిసారి శాసనసభ సమావేశాలు ప్రారంభం అవుతున్నాయి. 17 రోజులపాటు శాసనసభ కలాపాలు జరిగేలా నిర్ణయించారు. ఈనెల 21వ తేదీ వరకు శాసనసభ సమావేశాలు కొనసాగనున్నాయి. అధికార పార్టీ వైఫల్యాలను ఎండగట్టేందుకు ప్రతిపక్షాలు పలు అస్త్రాలను సిద్ధం చేసుకున్నాయి. అధికార కాంగ్రెస్‌లోనే కాకుండా ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్‌లలోనూ గ్రూపు విభేదాలు ఉన్నాయి. కాంగ్రెస్, బీజేపీలలో గ్రూపు విభేదాలు ఢిల్లీస్థాయికి చేరాయి. బీజేపీలో ఆ పార్టీ అధ్యక్షుడు విజయేంద్ర వర్సెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి బసనగౌడ పాటిల్ యత్నాళ్ మధ్య విమర్శలు రోజూ సాగుతున్నాయి. పార్టీలో ఎక్కువమంది ఎమ్మెల్యేలు, నాయకులు విజయేంద్రవర్గంలోనే ఉన్నా యత్నాళ్ సూటిపోటి మాటలకు ఎదుర్కోలేకపోతున్నారు. మరోవైపు ప్రతిపక్షనేత అశోక్ నిత్యం అధ్యక్షుడు విజయేంద్రతో వేదికలు పంచుకుంటున్నా ఆచితూచి వ్యవహరిస్తున్నారు. కొంతమంది స్తబ్దుగా ఉండే ఎమ్మెల్యేలు ఏ గ్రూపులోనూ గుర్తింపులేకుండా మౌనంగా ఉంటున్నారు. రాష్ట్రానికి చెందిన 17మంది ఎంపీలు ఉన్నారు. వారిలో ముగ్గురు కేంద్ర మంత్రులు ఉన్నా గ్రూపు విభేదాలకు ఎటువైపు మొగ్గు చూపకుండా ఉన్నారు. బీజేపీలో అధికార పార్టీని నిలదీసేందుకు అందరూ కలసి వస్తారా..? లేదా ఎవరిదారి వారిదే అవుతుందా..? అనేది చర్చనీయాంశం అవుతోంది. ఇక జేడీఎస్ పార్టీలో శాసనసభలో దశ, దిశ నిర్దేశంగా ఉండే కుమారస్వామి కేంద్ర రాజకీయాలవైపు వెళ్లారు. దీంతో ఆయన శాసనసభలో లేకుండా సాగుతున్న సమావేశాలలో పార్టీకి చెందిన ఎమ్మెల్యేలంతా ఒకేతాటిపై ఉంటారా..? అనేది పరిశీలించాల్సి ఉంది. అయితే మూడు పార్టీల్లోనూ భిన్న స్వరాలు వినిపిస్తుండంతో ఎవరు మద్దతు ఇస్తారో తేలడం లేదు.

7న బడ్జెట్

ఆర్థికమంత్రి హోదాలో సీఎం సిద్దరామయ్య ఈనెల 7వ తేదీన బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతోంది. సిద్దరామయ్య సుదీర్ఘ రాజకీయ చరిత్రలో మరో రికార్డు నమోదు చేయనున్నారు. ఆర్థిక మంత్రిగా, ఉపముఖ్యమంత్రిగా, ముఖ్యమంత్రిగా ఇప్పటివరకు 15సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారు. ప్రస్తుతం 16వ బడ్జెట్ ప్రవేశపెట్టడం ద్వారా మరో రికార్డు నెలకొల్పనున్నారు. ఈనెల 10నుంచి 21వరకు బడ్జెట్‌పై చర్చలు కొనసాగుతాయి.

సిద్ధమవుతున్న ప్రతిపక్షాలు

ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ నాయకులు రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను సభలో తిప్పికొట్టేందుకు సిద్ధమయ్యారు. ఇందుకోసం ప్రతిపక్ష నేత అశోక్, మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై, కేంద్రమంత్రి కుమారస్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రలు ప్రత్యేకంగా భేటీ అయి సభలో తీవ్రమైన అంశాలపై చర్చకు డిమాండ్ చేసేలా తీర్మానించారు. ఇటీవల చోటు చేసుకున్న పలు పరిణామాలను సభలో ప్రస్తావించి ప్రభుత్వాన్ని ముప్పుతిప్పలు పెట్టాలని నిర్ణయించారు. ప్రధానంగా రాష్ట్రంలో బీదర్, దక్షిణకన్నడ జిల్లాలో పట్టపగలు బ్యాంకుల దోపిడీ, మైసూరు ఉదయగిరి పోలీస్ స్టేషన్‌పై దాడి, అత్యాచారం, హత్యలు పెరిగి శాంతిభద్రతలకు భంగం కలిగేలాంటి పరిస్థితి ఏర్పడిందని ప్రధానంగా ప్రస్తావించదలిచారు.



సీఎంకు ప్రత్యేక ర్యాంప్

● ఈ ఏడాది కూర్చునే బడ్జెట్ సమర్పణ

బెంగళూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): సీఎం సిద్దరామయ్యకు మోకాలినొప్పికి చికిత్స జరిపించుకోవడంతో అందుకు అనుకూలంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. దాదాపు నెలరోజులకుపైగా సీఎం సిద్దరామయ్య అధికారిక నివాసం 'కావేరి'కే పరిమితమయ్యారు. బడ్జెట్‌కు సంబంధించి శాఖలవారీగా సమీక్షలు సైతం కావేరి నుంచి పర్యవేక్షించారు. ఇటీవల రెండు రోజులుగా రెండు సభలకు ఓ కేబినెట్ భేటీకి మాత్రమే సీఎం హాజరయ్యారు. ప్రస్తుతం సీఎం సిద్దరామయ్య వీల్‌చెయిర్‌లో వెళ్తున్నారు. సోమవారం నుంచి శాసనసభ సమావేశాలు ప్రారంభమవుతున్న తరుణంలో విధానసౌధలోకి సులభతరంగా చేరుకునేందుకు వీలుగా ప్రత్యేకమైన ర్యాంప్‌ను సిద్ధం చేస్తున్నారు. పశ్చిమద్వారం కెంగల్ గేట్ వద్ద ర్యాంప్‌ను అమరుస్తున్నారు. శాసనసభ సమావేశాలు సుదీర్ఘంగా కొనసాగుతున్న తరుణంలో ప్రతిరోజూ సులభతరంగా విధానసౌధకు వచ్చేందుకు అనుకూలంగా ర్యాంప్ ఏర్పాటు చేశారు. విధానసౌధలోని నాలుగు ద్వారాలపైకి పశ్చిమ భాగంలో ఉండే ఎంట్రెన్స్ మినహా మిగిలిన మూడు వైపుల ద్వారాలలోనూ ర్యాంప్ ఉంది. అయితే ముఖ్యమంత్రి సాధారణంగా పశ్చిమద్వారం నుంచి వస్తున్నందున అందుకు అనుకూలంగా ర్యాంప్ ఏర్పాటు చేస్తున్నారు.

కాగా సీఎం సిద్దరామయ్య ఈనెల 7న బడ్జెట్‌ను కూర్చుని సమర్పించే అవకాశం ఉంది. సీఎం మోకాలికి చికిత్సలు చేసిన వైద్యులు ఆరు వారాల పాటు విశ్రాంతి అవసరమని సూచించిన మేరకు కూర్చుని బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

ప్రధాన అస్త్రాలివే..!

- ఆర్డినెన్స్ జారీ చేసిన తర్వాత కూడా మైక్రో ఫైనాన్స్‌ల దోపిడీ సాగడం, రోజూ ఏదో ఒక ప్రాంతంలో ఆత్మహత్య కొనసాగడం.
- ఎస్సీ ఎస్టీలకు బడ్జెట్‌లో కేటాయించిన గ్రాంట్లు గ్యారెంటీల పథకాలకు వినియోగించడం
- గ్యారెంటీల సౌలభ్యాల పంపిణీలో వ్యత్యాసం.
- కర్ణాటక పబ్లిక్ సర్వీస్ కమిషన్ అక్రమాలు, లోపాలు
- ప్రభుత్వ ఆసుపత్రులలో బాలింతల మృతి
- ఆర్టీసీ, మెట్రో చార్జీల పెంపు - బెంగళూరు అభివృద్ధి కుశించడం
- బీబీఎంపీని విభజించి గ్రేటర్ బెంగళూరుగా మార్చాలనే అంశం
- వేసవిలో తలెత్తే సమస్యలు ప్రధానంగా ఉత్తర కర్ణాటకలో తాగునీటి సమస్యపై కనీసస్థాయిలో సమీక్షలు జరగకపోవడంపై ప్రభుత్వాన్ని నిలదీయదలిచారు.

రేపు కాంగ్రెస్ లెజిస్లేచర్ సభ

శాసనసభ సమావేశాలు ప్రారంభమవుతున్న తరుణంలో ఈనెల 4న కాంగ్రెస్ లెజిస్లేచర్ సభ ఏర్పాటు చేశారు. సీఎం సిద్ద రామయ్య అధ్యక్షతన సాయంత్రం లెజిస్లేచర్ భేటీకి ఆహ్వానించారు. సభలో ప్రధానంగా ప్రతిపక్షాలు లేవనెత్తేందుకు సిద్ధమైన అంశాలలో సభ్యులందరూ అవగాహన పొందాలని సూచించదలిచారు. శాసనసభలో ప్రతిపక్షాలు సంధించే అస్త్రాలకు దీటుగా ఎదుర్కొనాలని అవగాహన కల్పించదలిచారు. సభకు సభ్యులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని సందేశం ఇవ్వదలిచారు. కేపీసీసీ అధ్యక్షుడు, డీసీఎం డీకే శివకుమార్, పరిషత్ సభానాయకుడు ఎన్ఎస్ బోసరాజు, కేపీసీసీ కార్యాధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలందరికీ ఆహ్వానాలు పంపారు.



మా కుటుంబ సభ్యులే సీఎం కావాలంటే సాధ్యమా..?

● డీకే సురేశ్ వ్యాఖ్యలపై మంత్రి ప్రియాంక ఖర్గే

బెంగళూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి హోదా మా కుటుంబీకులకే కావాలంటే సాధ్యమా..? అటువంటి ఆశలు అందరికీ ఉంటాయని, అదంతా అధిష్ఠానం చూసుకుంటుందని మంత్రి ప్రియాంక ఖర్గే అభిప్రాయపడ్డారు. బెంగళూరులో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ ప్రతి వారికి మా కుటుంబానికి చెందినవారు సీఎం కావాలనే ఆశ ఉంటుందన్నారు. అయితే పార్టీ అధిష్ఠానం అంతిమంగా తీర్మానిస్తుందన్నారు. రాష్ట్ర బీజేపీలో నాయకత్వలోటు ఉందని దాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఆరోపణలు చేస్తుంటారన్నారు. బీజేపీకి సొంతంగా అధికారంలోకి వచ్చే ధైర్యం, సామర్థ్యం లేదన్నారు. గతంలో 17మందితో ఏక్‌నాథ్ శిండే వెళ్లినట్టు ప్రతిసారి జరగదన్నారు. బీజేపీ వారు ఎవరిని విమర్శించుకున్నా మాకు ఏం సంబంధమన్నారు. డీకే శివకుమార్ మహాశివరాత్రి వేడుకల్లో పాల్గొన్న అంశం చర్చించడం అనవసరమన్నారు. నాకు టుంబ సభ్యులే కాదు యతీంద్ర కూడా వారి కుటుంబానికి చెందినవారే ముఖ్యమంత్రిగా ఉండాలని భావిస్తారన్నారు. పదవి అంటే ఎవరికైనా ఆశ ఉంటుందని కానీ సమయం కోసం వేచి చూస్తుంటారన్నారు. పార్టీ కోసం అందరూ కష్టపడ్డారన్నారు.

మాజీ ఎంపీ డీకే సురేశ్ శనివారం బెంగళూరులో మీడియాతో మాట్లాడినవేళ తన ఆశ, ఆలోచన ప్రకారం తన అన్న డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కావాలనేది అన్నారు. అయితే ఆ స్థానంలో సిద్దరామయ్య ఉన్నారని, ఆయన పట్ల నాకు గౌరవం ఉందని, ఖాళీ అయినప్పుడు చర్చ వస్తుందని, అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందన్నారు. అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటే సంతోషమన్నారు. డీకే సురేశ్ వ్యాఖ్యలకు మంత్రి ప్రియాంక ఖర్గే స్పందించారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సెహరీ
6.44	5.23
సోమవారం సాయంత్రం	మంగళవారం ఉదయం

పెళ్లికి వెళ్లాను... చేయించింది నేను కాదు

● ఐపీఎస్ రవీంద్ర గడాది

బెంగళూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): బెళగావి జిల్లాలో బాలిక పెళ్లికి వెళ్లానని అయితే జరిపించింది తాను కాదని బెళగావి విభాగం మానవహక్కుల విభాగం డైరెక్టరేట్ ఎస్పీ అయిన ఐపీఎస్ అధికారి రవీంద్ర గడాది వివరణ ఇచ్చారు. అథణి తాలూకా ఐగళి గ్రామంలోని ఓ ప్రైవేట్ ఫాంహౌస్‌లో బాలిక వివాహం జరిగింది. మూడు నెలలక్రితం సదరు బాలిక బిడ్డకు జన్మనిచ్చింది. ఇటీవల కొన్ని రోజులుగా బంధువుల బాలిక వయస్సు పెంచి ఐపీఎస్ అధికారి రవీంద్ర దగ్గరుండి పెళ్లి జరిపించారనే ఆరోపణలు వచ్చాయి. 2008 జూన్ 1న బాలిక జన్మించింది. అయితే ఐపీఎస్ అధికారి డేట్ ఆఫ్ బర్త్‌ను 2002 జూన్ 1గా మార్పు చేసి 2022లో సమీప బంధువైన యువకుడితో వివాహం జరిపించారనేది ఆరోపణగా ఉంది. ఈ మేరకు ఆదివారం బెళగావిలో ఆయన మీడియాకు వివరణ ఇచ్చారు. పెళ్లి చేసుకున్న యువకుడు బంధువు అని, కుటుంబసమేతంగా పెళ్లికి వెళ్లింది వాస్తవమని అయితే పెళ్లి కుమార్తె వయస్సు తనకెలా తెలుస్తుందన్నారు. పెళ్లి పీటలపై ఉండే వధువుకు వయస్సు ఎలా ప్రశ్నిస్తామన్నారు. తాను పెళ్లి చేశాననడం వాస్తవం కాదన్నారు.

బర్డ్‌ఫ్లూ దెబ్బతో చికెన్ వ్యాపారులు డీలా 8

కేపీఎస్‌సీ అభ్యర్థులకు న్యాయం చేయండి
● రక్తంతో సీఎంకు లేఖలు రాసిన కరవే 7

బెంగళూరుకు కొరత లేదు..!

● కబిని, కేఆర్ఎస్ జలాశయాల్లో పుష్కలంగా నీరు ● వేసవిలోనూ తాగునీటి సమస్య తలెత్తదు ● అధికారుల సమీక్షలో మంత్రి మహదేవప్ప





బెంగళూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఏటా వేసవిలో నీటి కష్టాలు పడే బెంగళూరు, మైసూరు నగరాలకు ఈ సారి ఆ తిప్పలు తప్పాయి. కావేరి నదికి అనుబంధమైన కేఆర్ఎస్, కబిని జలాశయాలలో సంతృప్తికరంగా నీరు ఉందని ఈ ఏడాది వేసవిలో బెంగళూరు, మైసూరు నగరాలకు తాగునీటి సమస్య తలెత్తదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి, మైసూరు ఇన్‌చార్జ్ మంత్రి మహదేవప్ప మైసూరు జిల్లాపంచాయతీ కార్యాలయంలో అధికారులతో సమీక్ష జరిపారు. రెండు ప్రాజెక్టుల్లోనూ సంతృప్తికరంగా నీరు ఉందని అధికారులు వివరించారు. గత ఏడాది వర్షాలు ఉత్తమంగా కురవడంతో ప్రాజెక్టులలో దాదాపు నాలుగైదు నెలల పాటు నిలకడగా నీరు నిల్వ ఉండేదన్నారు. మే నెల వరకు ఆయకట్టుకు నీరు విడుదల చేయవచ్చునని అధికారులు తెలిపారు. కబిని డ్యాం సూపరింటెండెంట్ ఇంజనీర్ తెలిపిన మేరకు కబినిలో 14.2 టీఎంసీలు, కేఆర్ఎస్‌లో 30 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రంజిత్‌కుమార్ అభిప్రాయం మేరకు కబిని నుంచి 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని, జూన్ నెలాఖరు దాకా తాగునీటికి సమస్య లేదన్నారు. ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు రూ.13కోట్లు అవసరం అని వివరించారు.



ముగింపు వేడుకల వేదికపై మంత్రులు, కలెక్టర్ తదితరులు


తళుక్కు మన్న తారలు..!!

● హంపిలో నటీనటుల సందడి ● ప్రేక్షకులను పలకరిస్తూ ఉత్సాహపరిచిన నటి తార ● ముగిసిన ఉత్సవాలు

బళ్లారి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): హంపి ఉత్సవాల చివరిరోజు తారలు దిగివచ్చారా..అన్నట్లు నటీనటుల సందడి కనిపించింది. ఆహో ఆంధ్రభోజ శ్రీకృష్ణదేవరాయ విజయనగర సామ్రాజ్య నిర్మాణ తేజేవి రాజ ఈ శిథిలాలో చిరంజీవివైనా వయా.. అంటూ ఓ సినీ గాయకులు పాడిన మధుర గీతం విన్న ప్రతి ఒక్కరినీ కదిలించింది. హంపిలో రాయలవారి వైభవాన్ని చాటి చెప్పేందుకు ఏర్పాటు చేసిన ఉత్సవాలు అంబరాన్నంటాయి. ఎదుర బసవన్న వేదిక, విరుపాక్షేశ్వర వేదిక, మహానవి దిబ్బ వేదిక, ఎంపీ ప్రకాష్ వేదిక, సాక్షి గణపతి వేదిక ఇలా ఆరు వేదిక ద్వారా మూడు రోజులు పాటు వివిద సాంస్కృతిక, కళ, గాన, జానపద, కవిగోష్ఠి, బుర్రకథ, యక్షగాన, లాంటి ఎన్నో కార్యక్రమాలు జరిగాయి. ఏటా నవంబరు లేదా డిసెంబరు మాసంలో జరిగే హంపి ఉత్సవాలు ఈ సారి ఫిబ్రవరి చివరిలో జరిపారు. ప్రధాన రాజకీయ నాయకులు, సీఎం, డిప్యూటీ సీఎం, లాంటి రాజకీయ నాయకులు ఈసారి దూరంగా ఉన్నారు. హాలీవుడ్, బాలీవుడ్ లాంటి గాయకులు, నటీనటీమనులను ఎవరినీ పిలవలేదు. హంపీ అంటేనే ద్రావిడ భాషలకు ప్రసిద్ధి, ఇక్కడ అధికార భాష కన్నడ తో పాటు తెలుగు, తుళువా, మరాఠీ, హిందీ, తమిళం లాంటి భాషా ప్రయులు ఎక్కువగా ఉన్నారు . ఉత్సవాలకు కేవలం అధికార కన్నడ భాషకే పెద్దపీట వేశారని కొందరు పేర్కొంటున్నారు. తొలిరోజు విజయనగర జిల్లా మంత్రి ఉత్సవాలను ప్రధాన వేదిక ఎంపీ ప్రకాష్ వేదిక నుంచి ప్రారంభించారు. రెండవ రోజు కూడా ప్రముఖ నాయకులు ఎవరూ రాలేదు. ప్రవాసోద్యమ శాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ తప్పా, మూడో రోజు మాత్రం సినిమా హీరోలు, గాయకులు ఉత్సవాల్లో రాలిపోయారు. ఇక గ్రామీణ క్రీడలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వేసవిలో హంపీ ఉత్సవాలు నిర్వహించడం పర్యాటకులకు ఇబ్బందిగానే మారింది. హంపి ఉత్సవాలు అంటే ప్రపంచదేశాలు కూడా ఇటు వైపు చూస్తాయి. అలాంటి ఉత్సవాలను కొందరు స్థానికులకే పరిమితం చేయడం మంచిది కాదని కొందరు కవులు, కళాకారులు కూడా అభిప్రాయం వ్యక్తం వ్యక్తం చేస్తున్నారు. బళ్లారి జిల్లా నుంచి విజయనగర జిల్లా గా ఏర్పడి విడిపోవడం వల్ల బళ్లారి జిల్లా ప్రజానాయకులు కూడా పెద్దగా ఎవరూ రాలేకపోయారు. గతంలో ఉత్సవాలకు ఉమ్మడి జిల్లా నుంచి బస్సులు ఉచితంగా నడిపేవారు. కానీ ఈసారి కేవలం విజయనగర జిల్లాలో ఉండే గ్రామాలకు మాత్ర ఉచిత బస్సులు తిప్పారు. బళ్లారి, రాయచూరు. కొప్పళ తదితర జిల్లాల ప్రజలకు కొంత ఇబ్బందిగానే మారింది. అయితే ప్రముకులు ఎవరూ రాకున్నా ఉత్సవాలు ఘనంగానే జరిగిపోయాని ప్రవాసోద్యమ శాఖ, జిల్లా కన్నడ, మరియు సాంస్కృతిక శాఖ పేర్కొంది.



నటి తార



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1606.90	1,586.54
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	7,018	886
నీటి నిల్వ (టీఎంసీలు)	31.86	8.38

8న రాష్ట్రస్థాయి గిరిజన ఉత్సవం

బళ్లారి సిటీ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని డాక్టర్‌రాజ్‌కుమార్ రోడ్డులోని మున్సిపల్ కళాశాల మైదానంలో ఈనెల 8న రాష్ట్రస్థాయి గిరిజన ఉత్సవం 2025 కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కన్నడ సంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 8వ తేది ఉదయం 9గంటలకు స్థానిక ఇతర జిల్లాలనుండి 40జానపద బృందాలతో కూడిన జానపద సంగీత ఊరేగింపు నగరంలోని డాక్టర్ రాజ్‌కుమార్ రోడ్డులోని మున్సిపల్ మైదానం నుంచి గడిగిచెన్నప్ప సర్కిల్ ,బెంగళూరు రోడ్డు,బ్రూస్‌పేట పోలీస్‌స్టేషన్ ,తేరు వీది, హెచ్ఆర్, గవియప్ప సర్కిల్ ద్వారా జోళదరాశి దొడ్డనగౌడ వేదిక రంగమందిరాన్ని చేరుకుంటుంది. 10దుకాణాల్లో కళ శిల్పకళ పరదర్శనలు ,హస్తకళల ప్రదర్శనలు,గిరిజన దుస్తులు ,ఆభరణాల ప్రదర్శన ఉంటాయి. మున్సిపల్ కళాశాల మైదానంలో సాయంత్రం స్థానిక ఇతర జిల్లా కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈసందర్భంలో అదనపు జిల్లా కలెక్టర్ మహమ్మద్‌జుబేర్ పాల్గొన్నారు.

నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలి



ఉప్పరహళ్లి వద్ద నీటి కోసం తిరుగుతున్న నక్క

కంప్లి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): అడవుల్లో నీటి తొట్టెలను ఏర్పాటు చేసి మూగజీవాల దాహార్తిని తీర్చాలని సమాజ సేవకుడు వినోద్ కోరారు. కంప్లి పరిధిలోని మెట్రి, ఉప్పరహళ్లి, చిన్నాపురం, కొండలు, అడవుల్లో వుంటే ప్రాణులు, జంతువులు నక్కలు, చిరుతలు, ఎలుగుబంట్లు నీటి కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. రాత్రివేళల్లో గ్రామాల్లోకి వచ్చే అవకాశం వుంది. కావున కొండ చుట్టూ వున్న గ్రామాల చుట్టూ రాత్రి వేళల్లో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని, వర్షాకాలం వచ్చే వరకు వాటి దాహార్తి తీర్చేందుకు నీటి తొట్టెలను ఏర్పాటు చేయాలన్నారు.

చేనేతకు బడ్జెట్‌లో అన్యాయం

ధర్మవరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): చేనేత పరిశ్రమకు రాష్ట్ర బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం జరిగిందని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ... బడా పెట్టుబడిదారులకు పరిశ్రమ పెట్టుకుని రూ.1000 నుంచి రూ.10వేల వరకు ఉపాధి కల్పిస్తారని వారికి రూ.వేలకోట్లను రాయితీల పేరుతో దోచిపెడుతున్నారన్నారు. లక్షలాది మందికి ఉపాధిని కల్పిస్తున్న చేనేత పరిశ్రమకు బడ్జెట్‌లో కేవలం రూ.115.70 కోట్లు కేటాయించడం దారుణమన్నారు. ఎనిమిదేళ్లుగా సహకార సంఘాలకు ప్రభుత్వం నుంచి రావాలని బకాయిలు యారన్‌సబ్సిడీ, పావలావడ్డీ, రిబేటు, త్రిఫ్ట్ ఫండ్, మార్కెట్ ఇన్సెట్ బకాయిలు చెల్లించే ఊసే బడ్జెట్‌లో కనిపించలేదన్నారు. కర్నూల్ జిల్లాలో చేనేత కార్మికసంఘం విస్తృతస్థాయి సమావేశాన్ని ఈనెల 9న నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ముగిసిన సాంస్కృతిక సంబరం..!







శాశ్వేకాళ్ గణప్ప వేదికపై నాట్యం చేస్తున్న కళాకారులు





భువనేశ్వరీ దేవికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గవియప్ప

హోస్పేట/ కంప్లి, మార్చి 02 (ఆంధ్రజ్యోతి) : హంపి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉద్భవ వీరభద్రేశ్వర ఆలయం నుంచి హంపి విరుపాక్షేశ్వర ఆలయం వరకు భువనేశ్వరి దేవి ఊరేగింపు ఆదివారం వైభవంగా జరిగింది. అమ్మవారికి ఎమ్మెల్యే గవియప్ప పూజలు చేపట్టారు. అనంతరం గవియప్ప మాట్లాడుతూ హంపి ఉత్సవాలు అనగానే ఒక పండుగ గ్రామాల్లో ఎలా దసరా, ఉగాది తరహాలోనే ఉత్సవాలను పండుగలా జరుపుకుంటామన్నారు. మూడు రోజులు హంపిలో పండగ వాతారణం నెలకొందన్నారు. గాయత్రి వేదిక, ఎంపీ ప్రకాష్ వేదిక, ఎదురు బసవన్న వేదిక, శాశ్వేకాళ్ గణప్ప వేదిక, విరుపాక్షేశ్వరస్వామి వేదికల్లో కళాకారులు ఆకట్టుకున్నారు. గజలక్ష్మీ, లక్ష్మీదేవి, కోలాట, డోలు ప్రదర్శించాయి. ఉత్సవాల్లో కళాకారులు ప్రదర్శనలు కొనసాగించారు. సంగీతం, భరతనాట్యం, సంగీతకారుడు అర్జున్‌సర్జన్‌తో పాటు శునకాల ప్రదర్శన ఆకట్టుకున్నాయి. సంగీత, నాట్యప్రదర్శన అలరించింది. అలాగే భవనేశ్వరి హోటల్ వద్ద బైస్కై కూడా పూర్తిగా ఆకర్షణగా నిలిచాయి. అలాగే పండ్లపై వివిధ నేతల చిత్రాలు, పుష్పాలంకరణ కూడా ఆకట్టుకున్నాయి. మూడవ రోజు ఆదివారం కావడంతో పర్యాటకులు భారీఎత్తున తరలివచ్చారు. ఎదురుబసవన్న వేదికలో పార్వతీ పరమేశ్వరుల వేషధారణలో నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్నారు.



ఎదురు బసవన్న వేదికపై పార్వతీపరమేశ్వరుల నృత్యం



శునకాల ప్రదర్శనలో విజేతలకు బహుమతుల అందజేత



వేదికపై పాట పాడుతున్న గాయకులు

బర్డ్‌ఫ్లూ దెబ్బతో చికెన్ వ్యాపారులు డీలా

● పడిపోయిన అమ్మకాలు ● కోళ్ల మృతితో పెంపకందారుల ఆందోళన

బళ్లారి సిటీ,మార్చి2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బర్డ్‌ఫ్లూ కారణంగా చికెన్ వ్యాపారం భారీగా పడిపోయింది. అటు కోళ్ల పెంపకం దారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఓ వైపు కోళ్లు చనిపోతున్నాయి. మరోవైపు కోడి మాంసం ధర తగ్గుముఖం పడుతోంది. ఇలా వ్యాపారులు, పెపంకందారులకు ఆవేదన తప్పడం లేదు. కోవిడ్ కాలంలో కోడి మాంసం కిలో రూ.10కి పడిపోయింది. అలాంటి చీకటి రోజులు మళ్ళీ పునరావృతమవుతాయని కోళ్ళ పెంపకదారులు ఆందోళన చెందుతున్నారు. దుకాణా యజమాని ఖాజాసాబు మాట్లాడుతు మా దుకాణం సగటున రోజుకు రూ.30వేలు టర్నోవర్‌చేసేది, బర్డ్‌ఫ్లూ కారణంగా వారం రోజులుగా రూ. 3వేలు వ్యాపారం కూడా జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టు నుంచి శ్రావణ, కార్తీక, అయ్యప్ప మాలవంటి ఏదో ఒక పండుగ కారణంగా కోడి మాంసం వ్యాపారం తగ్గిందన్నారు. ఫిబ్రవరి 15వతేదీ తర్వాత వ్యాపారం బాగా జరగుతుందని ఆశించాము కానీ ఇప్పుడు బర్డ్‌ఫ్లూ దెబ్బ తగిలిందని చికెన్ షాపు యజమాని రియాజ్ అన్నారు. రంజాన్ ,ఉగాది నెలల్లో చికెన్ దుకాణాలు చురుగ్గా జరిగేవని, అయితే ఇప్పుడు ఘోరంగా పడిపోయాయన్నారు.



చికెన్ షాపులో మిగిలిపోయిన కోళ్ళు

వ్యాపారం పడిపోవడంతో తీవ్ర నష్టాలు చవిచూస్తున్నామని వాపోతున్నారు. బళ్లారి నగరంలో దాదాపు 500-600 చికెన్‌దుకాణాలు ఉన్నాయి. వాటిలో చాలా వరకు ఇటీవల ఖాళీగా కనిపిస్తున్నాయి. గత వారం కోడి మాంసం రూ. 180 ఉండేది. ఇప్పుడు అది 150-160 తగ్గింది. అయితే మాంసం అడిగే వారిసంఖ్య తగ్గింది. ఆంధ్రప్రదేశ్‌లో కోళ్ళను కిలోకు రూ. 80 కి అమ్ముతున్నట్లు వ్యాపారులు తెలిపారు.

వండుకుని తింటే ఇబ్బంది లేదు

హనుమంత నాయక్, డీడీ, పశుసంవర్ధక శాఖ

భారతీయులు ఆహారాన్ని బాగా వండి తింటారు. దీంతో చికెన్ తిన్నా ఎలాంటి నష్టం లేదు. 70-90 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద పదార్థాలను ఉడికించినప్పుడు ఏ వైరస్ కూడా మనుగడ సాగించదు. ఉడికించిన కోళ్లు లేదా కోడి గుడ్డు తినడంలో ఎటువంటి సమస్య లేదు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఆరోగ్యకరమైన గుడ్డు తినడం మంచిదే.

పంటలకు గిట్టుబాటు ధర, బీమా కల్పించాలి

ధర్మవరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పంటలకు గిట్టుబాటు ధర, బీమా సౌకర్యం కల్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్ హెచ్‌బాషా కోరారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వారు మాట్లాడారు. హంద్రీ నీవా కాలువలను వెడల్పు చేసి.. అన్ని చెరువులకు నీటిని సరఫరా చేయాలని, గ్రీన్‌ఎనర్జీ కారిడార్ పేరిట సేకరిస్తున్న రైతుల భూములను నిలుపుదల చేయాలని, సాగులో ఉన్న వారికి పట్టా పాసుపుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



శిక్షణ యూనిట్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాలి జనార్ధనరెడ్డి

మహిళలకు కుట్టు శిక్షణ ప్రారంభం

గంగావతి రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏపీఎంసీ మార్కెట్‌లోని మారుతేశ్వర ఆలయ సమీపంలో విశ్వభారతి కళానికేతన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత జీన్స్‌కుట్టు శిక్షణ యూనిట్‌ను ఆదివారం గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్ధనరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ కేంద్రం ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొంది, వస్త్ర పరిశ్రమలో ఉద్యోగాలు పొందేలా చేయడమే తమ ఆశయమన్నారు. ఈ ఉచిత శిక్షణా కేంద్రాన్ని ఈ ప్రాంత మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా మున్సిపల్ కౌన్సిల్ అధ్యక్షుడు మౌలాసాబ్, ఉపాధ్యక్షుడు పార్వతివ దుర్గేశ్, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు విరూపాక్షప్ప, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు బసవంత్ పాటిల్, హుస్సేన్ బాషా, సయ్యద్ ఆలీ, దీపక్ బంట్యానీలకంఠ, వీరేశ్, వీరనగౌడ, భారతి అగులూరు, లలిత,ఈరమ్మ, సుమ, విజయలక్ష్మి,సౌభాగ్య, దిల్కిన్‌బాను, షాహిన్ పాల్గొన్నారు.

అభివృద్ధి శూన్యం: మాజీ ఎమ్మెల్యే



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప

సిరుగుప్ప, మార్చి 2(ఆంధ్రజ్యోతి): తాలూకాలో అభివృద్ధి శూన్యమైందని అవినీతి, అక్రమాలు విలయతాండవం చేస్తున్నాయని బీజేపీ మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని అతిథి గృహంలో విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ. 25 కోట్ల వ్యయంతో ఎత్తిపోతల పథకం కింద జరుగుతున్న పనులకు ఇంత వరకు రైతులకు బిల్లులు చెల్లించలేదని, ఎస్సీ, ఎస్టీ నిధులను గ్యారెంటీ పథకాలకు ఉపయోగించడం సరైంది కాదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎర్రమట్టి, ఇసుక రేయి పగలు అక్రమంగా రవాణా జరుగుతున్నా పట్టించుకునే వారు లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. జొన్నల విక్రయ కేంద్రాలను తక్షణమే ప్రారంభించి రైతులకు బిల్లులు ఇవ్వాలని కోరారు. తక్షణమే అక్రమ వ్యవహారాలను నిలిపివేయకుంటే నిరాహారదీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా బీజేపీ తాలుకా అధ్యక్షుడు మల్లికార్జున స్వామి, కుమార గౌడ, నాగేష్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు బెళగల్ శివప్ప, శేకప్ప, జిల్లా కన్వీనర్ దొడ్డ ఉలిగప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



భూమిపూజలో ఎమ్మెల్యే బీఎం నాగరాజు

సిరుగుప్ప, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రోడ్డు పనులకు ఎమ్మెల్యే నాగరాజు ఆదివారం భూమిపూజ చేపట్టారు. రూ.92 లక్షల వ్యయంతో రోడ్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బీఎం నాగరాజు భూమి పూజ చేశారు. సిరుగుప్ప పట్టణం 29, 30, 31 వార్డుల్లో కళ్యాణకర్ణాటక నిధుల కింద రోడ్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ సందర్భంగా నగరసభ అధ్యక్షురాలు రేణుకమ్మ, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, సీనియర్ నాయకులు చిన్న కృష్ణ, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

హోసూరు జోన్

అగ్ని ప్రమాదంతో అపార నష్టం



ఫ్యాక్టరీలో చెలరేగుతున్న మంటలు

హోసూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): శూలగిరి సమీపంలోని ప్రైవేట్ పరుపుల తయారీ ఫ్యాక్టరీలో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో అగ్ని ప్రమాదం జరిగింది. చెన్నై - బెంగళూరు జాతీయ రహదారి మార్గంలో శూలగిరి బస్టాండ్ సమీపాన పరుపుల తయారీ ఫ్యాక్టరీలో ఆదివారం ఒక్కసారిగా మంటలు చోటు చేసుకున్నాయి. ఫ్యాక్టరీలో పనిచేస్తున్న పది మంది కార్మికులు వెంటనే బయటపడ్డారు. తక్షణం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ ఇంజన్లతో చేరుకుని గంటకుపైగా శ్రమించి మంటలను నియంత్రించారు. ముడి పదార్థాలు, యంత్రాలు ఇతరత్రా కాలిపోవడంతో సుమారు రూ.20లక్షల మేర కాలిపోయినట్లు తెలుస్తోంది. శూలగిరి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఉత్సాహంగా ఎడ్లపందేలు

హోసూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): బాగలూరు సమీపంలోని బాలికనపల్లిలో సంప్రదాయ ఎడ్ల పందేలు నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రకాశ్ లాంఛనంగా ప్రారంభించారు. రంగు రంగుల బెలూన్లతో ఎద్దులను అలంకరించారు. హోసూరు, డెంకణీకోట, కెలమంగలం, తళి, శూలగిరి, కృష్ణగిరి, సరిహద్దులోని కోలారు, సర్జాపుర, అత్తిబెలె తదితర ప్రాంతాలనుంచి 200కుపైగా ఎడ్లను తీసుకొచ్చారు. ఎడ్ల పందేలను తిలకించేందుకు ప్రజలు పెద్దసంఖ్యలో వచ్చారు. గోరక్షకులు, యువకులు ఎడ్లను నిభాయించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బాగలూరు పోలీసులు పర్యవేక్షించారు.





ఎడ్లను అదుపు చేస్తున్న యువకులు



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

నగరంలో కలెక్టర్ విస్తృత తనిఖీలు

హోసూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా పంచాయతీ యూనియన్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీలను కలెక్టర్ దినేశ్‌కుమార్ అకస్మిక తనిఖీలు చేశారు. పాతకోట గ్రామంలోని బాలలకేంద్రాన్ని సందర్శించి చిన్నారుల హాజరు, బరువు, ఎత్తు, పిల్లలకు ఇస్తున్న పోషకాహార నమూనాలను పరిశీలించారు. పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. అనంతరం చౌక దుకాణాలను సందర్శించి ఆహార నిల్వలను తనిఖీ చేశారు. కనలాటి పంచాయతీ, అట్టకురికి పంచాయతీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఇస్తున్న అల్పాహారం, మధ్యాహ్న భోజన ఆహార నాణ్యతను పరిశీలించారు. విద్యార్థుల పఠనా సామర్థ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. తిరుక్కురుల్ అసైన్‌మెంట్ గురించి ఆరా తీశారు. విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. తర్వాత గ్రామంలోని ఉద్యానవనశాఖ సహకారంతో రైతు లఘుమయ్య అమలు చేస్తున్న డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని పరిశీలించారు. పుదీనా సాగు, పంట ఖర్చులు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట వివిధశాఖల అధికారులు ఉన్నారు.

మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు వినతి

రాయచూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రాయచూరు జిల్లాలో మెగా టెక్స్టైల్ పార్కును ఏర్పాటు చేసేలా కేంద్ర ప్రభుత్వం వద్ద తగిన కృషి చేయాలని జనతాదళ్(ఎస్) నాయకులు కోరారు. ఆదివారం మంత్రాలయం పర్యటనకు వచ్చిన కేంద్ర పరిశ్రమలు ఉక్కు గనుల శాఖల మంత్రి హెచ్‌డీ కుమారస్వామికి జిల్లా జేడీఎస్ అధ్యక్షుడు ఎం.విరుపాక్షి నేతృత్వంలోని ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. జిల్లాలో పెద్ద ఎత్తున పత్తిసాగు జరుగుతున్న నేపథ్యంలో అనేక జిన్నింగ్ మిల్లులు సహితం అందుబాటులోనే ఉన్నాయని ఈ క్రమంలో రైతులను ప్రోత్సహించడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా టెక్స్టైల్ పార్కు ఏర్పాటు నిర్మాణం జరగాలని మంత్రిని కోరారు. ఈ దిశగా కేంద్ర మంత్రి తగిన చొరవ తీసుకోవాలని కోరారు.



కేంద్ర మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న విరుపాక్షి

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

జమ్‌షెడ్జీ టాటా (జయంతి)




భారత పరిశ్రమ పితామహగా పేరొందిన జమ్‌షెడ్జీ నుసర్వాన్జీ టాటా 1839 మార్చి 3న గుజరాత్ రాష్ట్రం నవరి ప్రాంతంలో జన్మించారు. దేశంలో అతి పెద్ద వ్యాపార సంస్థ టాటా గ్రూప్ సంస్థాపకులు. పారిశ్రామిక ప్రపంచంలో ఎంతగా ప్రభావం చూపారంటే దేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ఆయనను వన్‌మ్యాన్ ప్లానింగ్ కమిషన్‌గా అభివర్ణించారు. పత్తి, దుక్క ఇనుము పరిశ్రమలలో అనేక వ్యాపారాల ద్వారా భారతదేశ వ్యాపార ప్రపంచాన్ని మార్చారు. ఆయన సాధించిన విజయాలలో జంషెడ్‌పూర్‌లోని టాటా ఐరన్ అండ్ స్టీల్ వర్క్స్ సంస్థ ప్రముఖమైనది. ఆ తర్వాత పలు రంగాల్లో సత్తా చాటారు. 1904 మే 19న కన్నుమూశారు.

అలెగ్జాండర్ గ్రాహంబెల్ (జయంతి)



అంతర్జాతీయస్థాయిలో శాస్త్రవేత్తగా, ఇంజనీర్‌గా పేరొందిన అలెగ్జాండర్ గ్రాహంబెల్ 1847 మార్చి 3న స్కాట్లాండ్ దేశంలోని ఎడిన్‌బర్గ్‌లో జన్మించారు. టెలిఫోన్ ఆవిష్కర్తగా ప్రపంచ వ్యాప్తంగా పేరొందారు. అమెరికన్ టెలిఫోన్ అండ్ టెలిగ్రాఫ్ కంపెనీ (ఏటీ అండ్ టీ) సంస్థ సంస్థాపకులలో ఒకరు. యూఎస్ పేటెంట్ ఆఫీస్ నుంచి దేశంలో తొలి ఆవిష్కర్తగా నమోదయ్యారు. బధిరుల సమస్యల పరిష్కారానికి వైద్య పరిశోధనలు చేశారు. నేషనల్ జియోగ్రాఫిక్ సొసైటీ పత్రికకు పునాదులు వేశారు. పలు పురస్కారాలు అందుకున్నారు. 1922 ఆగస్టు 2న కన్నుమూశారు.

మానవల్లి రామకృష్ణ కవి (జయంతి)



మానవల్లి రామకృష్ణ కవి 1866 మార్చి 3న మద్రాసులో జన్మించారు. సాహిత్య పరిశోధకులు, కవి, సంస్కృతాంధ్ర పండితుడు, బహు భాషా కోవిదుడు. 16 ఏళ్లకే 'మృగవతి' కవితను రాసి 'కవి' బిరుదును పొందారు. మద్రాసులోని ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారములోనూ, తర్వాత వనపర్తి సంస్థానంలోనూ ఆంతరంగిక కార్యదర్శిగా పనిచేశారు. తాళపత్రాలను సేకరించి అభినవ భారతి, కుమార సంభవం వంటి కృతులను వెలుగులోకి తెచ్చారు. 1957 సెప్టెంబరు 21న తిరుపతిలో కన్నుమూశారు.

ఆచంట లక్ష్మీపతి (జయంతి)



డాక్టర్ ఆచంట లక్ష్మీపతి 1880 మార్చి 3న పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలులో జన్మించారు. కందుకూరి వీరేశలింగం శిష్యులలో ఒకరు. ఆయుర్వేద కళాశాలలో ప్రిన్సిపాల్‌గా సేవలందించారు. తెలుగులో 'ధన్వంతరి' పత్రికనూ, ఆంగ్లంలో 'ఆంధ్రా మెడికల్ జర్నల్'ను ప్రచురించారు. భారతీయ వైద్యం పై 63 పుస్తకాలు రచించారు. మద్రాసులో ఆంధ్ర సాహిత్య పరిషత్‌కు కార్యదర్శిగా పనిచేశారు. ఆయుర్వేద వైద్యుడిగానే కాక సంఘసేవకుడిగా, రచయితగా సేవలందించిన ఆయన 1962 ఆగస్టు 6న కన్నుమూశారు.

పండిట్ పుట్టరాజ్ గవాయ్ (జయంతి)



'పద్మభూషణ్' గ్రహీత పండిట్ పుట్టరాజ్ గవాయ్ 1914 మార్చి 3న హావేరి జిల్లా దేవగిరి ప్రాంతంలో జన్మించారు. గ్వాలియర్ ఘరానా శైలిలో హిందూస్తానీ సంగీతంలో పేరొందారు. వీణ, తబల, మృదంగం, వయోలిన్ వంటి వాటిలో నిష్ణాతులు. భజనల పాటలు ప్రత్యేకం. కన్నడ, సంస్కృత, హిందీ భాషలలో 80కుపైగా వచనాల పుస్తకాలు రాశారు. భగవద్గీతను బ్రెయిలీలో రాసిన ఘనత ఆయనది. దివ్యాంగుల కోసం, నాటక రంగం కోసం పాటుపడ్డారు. 2010 సెప్టెంబరు 17న కన్నుమూశారు.

శంకరమంచి సత్యం (జయంతి)



కథా రచయితగా పేరొందిన శంకర మంచి సత్యం 1937 మార్చి 3న గుంటూరు జిల్లా అమరావతి గ్రామంలో జన్మించారు. తెలుగులో ఆయన రాసిన 'అమరావతి కథలు' ఎంతో ప్రాచుర్యం పొందాయి. 1979లో రాష్ట్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు. ఆయన రాసిన 'ది ఫ్లడ్' ఆంగ్లంలోకి అనువాదమైంది. బుల్లితెర దర్శకుడు శ్యామ్‌బెనెగల్ 'అమరావతి కి కథయే' పేరిట ప్రసారం చేశారు. 1987 మే 21న కన్నుమూశారు.

శంకర్ మహదేవన్ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత శంకర్ మహదేవన్ 1967 మార్చి 3న ముంబైలో జన్మించారు. దేశంలో పేరొందిన 'శంకర్-ఎహ్సాన్-లోయ్' త్రయంలో గాయకుడు, స్వరకర్త. బాల్యంనుంచే హిందూస్తానీ, కర్ణాటక సంగీతం నేర్చుకున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా కెరీర్ ప్రారంభించి సంగీతంలో రాణించారు. ఉత్తమ గాయకుడిగా పలు అవార్డులు పొందారు. 81 దేశాలలో అకాడమీ ఏర్పాటు చేసి ఔత్సాహికులకు సంగీతంలో శిక్షణ ఇస్తున్నారు. సామాజిక చైతన్య కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నారు. 2024లో గ్రామీ పురస్కారం అందుకున్నారు.

చెవి కమ్మలు లాక్కెళ్లాడు..

దొడ్డబళ్లాపుర, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఒంటరిగా ఉన్న వృద్ధురాలి చెవి కమ్మలను దుండగులు లాక్కుని పరారయ్యారు. తాలూకాలోని వడ్డరహళ్ళికి చెందిన చంద్రమ్మ (75)నుంచి కమ్మలు లాక్కుని పారిపోయారు. కంటనకుంటె గ్రామం నుంచి సుమారు కిలోమీటరు దూరంలోని యలహంక - హిందూపురం రహదారి పక్కన పశువులను మేపుతున్న వృద్ధురాలిని గమనించిన దుండగులు బైక్‌పై వచ్చి ఏమార్చి నగలు లాక్కున్నారు. దొడ్డబళ్లాపుర రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా ఇటీవల చైన్ స్నాచర్‌ల బెడద పెరిగిందని తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. నేరాల నియంత్రణకు గట్టి నిఘా పెంచే చర్యలు చేపట్టాలని, దుండలను అరెస్టు చేసి తగిన శిక్ష విధించాలని గ్రామస్తులు కోరారు.

ప్రోత్సాహకాలు భవిష్యత్తుకు మార్గదర్శకం కావాలి

» ఆర్యవైశ్య ట్రస్టు స్కాలర్‌షిప్‌ల ప్రదానోత్సవంలో గవర్నర్



స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న గవర్నర్ థావర్‌చంద్‌గెహ్లాట్, ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ ప్రతిభాసింగ్ తదితరులు

బెంగళూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉన్నత విద్య అందుబాటులోకి వచ్చిందని ఎన్నో సంఘసంస్థలు ట్రస్టులు ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నాయని అవి పొందేవారి భవిష్యత్తుకు మార్గదర్శకం కావాలని గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ పిలుపునిచ్చారు. నగరంలోని జయనగర్ మూడో బ్లాక్ ఎస్‌ఎంకే ఆర్‌వీ కళాశాల ప్రాంగణంలో కర్ణాటక ఆర్యవైశ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటైన స్కాలర్‌షిప్ పంపిణీలో ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. విద్యతో పొందే విజయాలు స్వావలంబన, ఉజ్వల భవిష్యత్తుకు బాటలు అవుతాయన్నారు. విద్య ఉద్దేశ్యం వ్యక్తిగత విజయం సాధించడం ద్వారా సమాజ ప్రగతికి దోహదపడుతుందన్నారు. వాసవి పీఠం సచ్చిదానంద సరస్వతి స్వామిజీ, ఢిల్లీ హైకోర్టు జస్టిస్ ఎం ప్రతిభాసింగ్, ట్రస్టు అధ్యక్షులు చార్టెడ్ అకౌంటెంట్ ఐఎస్ ప్రసాద్ ముఖ్యులుగా పాల్గొన్నారు. 2024-25 సంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి మందికిపైగా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. వీరిలో 400మంది బాలికలు ఉండగా పీయూ, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ఎంబీబీఎస్, ఇతర వృత్తివిద్యా కోర్సులకు కనీసం రూ.10వేల నుంచి గరిష్ఠంగా రూ.50వేల వరకు స్కాలర్‌షిప్‌లు అందచేశారు. వెయ్యిమందికిపైగా విద్యార్థులకు గాను సాంకేతికంగా కొందరు అంధ విద్యార్థులకు గవర్నర్ స్వయంగా స్కాలర్‌షిప్ చెక్కులు అందచేసి అభినందించారు. మిగిలినవారికి దాతలచే విద్యార్థులకు అందచేశారు. ఈ సందర్భంగా గవర్నర్ ప్రసంగిస్తూ సమాజంలో ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్న వారికి స్కాలర్‌షిప్‌లు ఒక వరంలా ఉన్నాయన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో భారత్ ఒకటని, ప్రపంచంలో మూడో ఆర్థికతకు సిద్ధంగా ఉందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఆశయానికి అనుగుణంగా వికసిత భారత్‌కోసం యువత ముందడుగు వేయాలన్నారు. స్కాలర్‌షిప్‌లకే పరిమితం కాకుండా గ్రంథాలయాలు, అధ్యయన కేంద్రాలు, ఆరోగ్య శిబిరాలు, నైపుణ్యాభివృద్ధి శిబిరాలతో ట్రస్టు ఉత్తమ సమాజసేవ చేస్తోందని గవర్నర్ కొనియాడారు.

దాతలుగా ఎదగండి: జస్టిస్

ఢిల్లీ హైకోర్టు జస్టిస్ ప్రతిభాసింగ్ ప్రసంగిస్తూ స్కాలర్‌షిప్‌ల ప్రయోజనం పొందినవారు రానున్న రోజుల్లో దాతలుగా ఎదిగి ఇతరులకు చేయూత ఇవ్వాలని పిలుపునిచ్చారు. లైఫ్ ఈజ్ వర్క్, వర్క్ ఈజ్ లైఫ్ అంటూ విద్యార్థులలో స్ఫూర్తి నింపారు. వాసవి పీఠం సచ్చిదానంద సరస్వతి స్వామిజీ మాట్లాడుతూ విద్యార్థి దశలో సమయాన్ని వృథా చేసుకోరాదన్నారు. చక్కగా చదివి ప్రయోజకులు కావాలని సూచించారు. ట్రస్టు అధ్యక్షులు ఐఎస్ ప్రసాద్ మాట్లాడుతూ గడిచిన 16 ఏళ్లలో 14 కోట్ల రూపాయలను 15వేల మందికిపైగా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల రూపంలో అందచేశామన్నారు. విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమనే లక్ష్యంతో తమ వంతుగా విద్యా వికాసానికి కృషి చేస్తున్నామన్నారు. 2008లో సంస్థ ప్రారంభమైనప్పుడు 30మంది దాతలు సహకారం అందించగా ప్రస్తుతం 241 మంది ఉన్నారన్నారు. ఏటా కోటి రూపాయల దాకా స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నామన్నారు. పేద ప్రతిభావంత విద్యార్థులకు ఆర్థిక భరోసా ఇవ్వడం ద్వారా వారిని ప్రోత్సహిస్తున్నామన్నారు. అంతేకాక వారు సంపాదించే స్థాయికి చేరాక వారు కూడా ఇతరులకు సాయం చేసే తత్వం అలవరచుకోవాలని హితవు పలికారు. ప్రస్తుతం విద్యార్థినులకోసం హాస్టల్ నిర్మిస్తున్నామని ఇందుకు దాతలనుంచి సహకారం అందుతోందన్నారు. ఇదే సందర్భంగా విద్యార్థులచేత ప్రతిజ్ఞ చేయించారు. గవర్నర్‌ను, ఢిల్లీ హైకోర్టు జస్టిస్‌ను ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్టు పదాధికారులు కేఆర్ ప్రదీప్, ఎస్‌వీఎస్ గుప్త, ఆర్ కాశీనాథ్, బీఏ శ్రీనివాస్ గుప్త, పీవీ ద్వారకనాథ్, విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఈ-ఖాతాపై ప్రచారం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నగరసభ కమిషనర్

చింతామణి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): నగరసభ పరిధిలో ఖాతా చేసుకోవడంలో జరుగుతున్న జాప్యంపై కొన్ని సంఘాలు నిరసన వ్యక్తం చేస్తున్న తరుణంలో నగరసభ కమిషనర్ జీఎన్ చలపతి స్పందించి చర్యలు తీసుకున్నారు. చింతామణి పట్టణపరిధిలో ఇప్పటికే పలు లే అవుట్‌లు తలెత్తాయని, ప్రజలు స్థలాలను కొనుగోలు చేస్తున్నారని కమిషనర్ అభిప్రాయపడ్డారు. అయితే ఆస్తికి ఆమోదం దక్కడంలో జాప్యం అవుతోందన్నారు. అన్ని రికార్డులు కల్గిన ఎంతోమంది ఆస్తుల యజమానులు ఖాతాలకోసం స్థానిక సంస్థల ఇబ్బంది పడుతున్నారని గుర్తించినట్టు తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం బి-ఖాతాను ఇ-ఖాతా చేసుకోవడానికి మూడు నెలల గడువు విధించిందని ఇందుకు సంబంధించి కరపత్రాల ద్వారా ప్రజలను చైతన్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. నగరసభ సభాంగణలో కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఏ, బీ ఖాతాలకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా అర్జీలను స్వీకరించి పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. అర్జీదారుడు బి ఖాతాకోసం ఫోటో, క్రయపత్రం, దానపత్రం, విభాగ పత్రం, రిలీజ్‌పత్రం, ఆస్తి పన్ను, నీటి పన్ను రసీదు, ఇసి నమూనా 15, 16 ఫారాలు, ఆస్తి యజమాని ఆధార్ కార్డు, మొబైల్ నెంబరు ఇతరత్రా వివరాలు పొందుపరచాల్సి ఉంటుందన్నారు. ప్రజలకు అవగాహన కల్పించేలా ఆదివారం పలు వార్డులలో కరపత్రాలు పంపిణీ చేశారు.

కేపీఎస్‌సీ అభ్యర్థులకు న్యాయం చేయండి

» రక్తంతో సీఎంకు లేఖలు ప్రదర్శించిన కరవే

బెంగళూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కేఏఎస్ పరీక్షలు రాసిన కన్నడ అభ్యర్థులకు న్యాయం కల్పించాలని కర్ణాటక రక్షణా వేదిక డిమాండ్ చేసింది. ఈమేరకు అభ్యర్థులు కొంతమంది రక్తంతో ముఖ్యమంత్రికి రాసిన లేఖలను ఆదివారం కరవే నాయకులు ప్రదర్శించారు. కేపీఎస్‌సీ పరీక్షల్లో కన్నడిగులకు జరుగుతున్న అన్యాయాన్ని సరిచేయాలని కరవే అధ్యక్షుడు నారాయణగౌడ డిమాండ్ చేశారు. కాగా కన్నడ కోసం రక్తాన్ని కాదు ప్రాణాలు ఇచ్చేందుకు కూడా సిద్ధమంటూ కొందరు అభిమానులు రక్తంతో రాసిన లేఖలను ప్రదర్శించారు. కేపీఎస్‌సీ పరీక్షల్లో కన్నడిగులకు న్యాయం జరిగేంతవరకు తమ పోరాటం కొనసాగిస్తామని కరవే నాయకులు పేర్కొన్నారు.



రక్తంతో రాసిన లేఖలను చూపుతున్న కరవే నేతలు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



సాంస్కృతిక ప్రదర్శనలో చిన్నారులు

బెంగళూరు మెట్రో, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సర్ సివిరామన్ నగర్‌లోని లిటిల్ విల్లె ప్రీ స్కూల్ వార్షికోత్సవంలో భాగంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. లిటిల్‌విల్లె దేశవ్యాప్తంగా 150కుపైగా ప్రాంతాలలో ప్రిస్కూల్ కల్గిన అతిపెద్ద విద్యాసంస్థల సమూహంగా ఉంది. ఒక అద్భుత కుటుంబం పేరిట ఏర్పాటైన కార్యక్రమంలో ఉమ్మడి కుటుంబంలో అవ్వా-తాతల ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థుల ప్రతిభా ప్రదర్శన ఆకట్టుకుంది. పాఠశాల ప్రిన్సిపాల్ ఆశా అనంతేశ్ మాట్లాడుతూ దేశంలో ప్రిస్కూల్‌లో చేరేవారిసంఖ్య క్రమేపీ పెరుగుతోందన్నారు. మూడేళ్లలోపు విద్యార్థులు 80శాతం, నాలుగేళ్లలోపు పిల్లలు 85శాతం చేరుతున్నారన్నారు. కాగా తాము డే కేర్ సదుపాయం కలిగి ఉన్నట్టు తెలిపారు.

బుక్ ఫెయిర్‌ను సందర్శించిన గవర్నర్



విధానసౌధ వద్ద సందడి



పుస్తకాలను పరిశీలిస్తున్న గవర్నర్ తదితరులు

బెంగళూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): విధానసౌధ ప్రాంగణంలో ఏర్పాటైన బుక్‌ఫెయిర్‌కు ఆదివారం సందర్శకులు పోటెత్తారు. వారాంతం కావడంతో సాధారణం కంటే ప్రజలు ఉత్సాహంగా విచ్చేసి తమకు ఆసక్తి కల్గిన పుస్తకాలను కొనుగోలు చేశారు. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్, స్పీకర్ యూటీ ఖాదర్, పరిషత్ సభాపతి బసవరాజ హొరట్టిలు ఆదివారం సందర్శించారు. ఆంగ్ల-కన్నడ నిఘంటువును ఆసక్తిగా గవర్నర్ వీక్షించారు. బుక్‌ఫెయిర్‌లో వందకుపైగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఆదివారం రోజంతా సందడి నెలకొంది. మధ్యాహ్నం రద్దీ ఎక్కువగా ఉండడంతో క్యూ పద్ధతి పాటించేలా పర్యవేక్షించారు. ఎండను సైతం లెక్కించక సందర్శకులు స్టాల్స్‌ను సందర్శించి పుస్తకాలు కొనుగోలు చేశారు. సోమవారం కూడా బుక్ ఫెయిర్ కొనసాగనుంది.

బదిలీ అయిన ఉద్యోగికి వీడ్కోలు



బదిలీ అయిన ఉద్యోగిని సన్మానిస్తున్న దృశ్యం

బాగేపల్లి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): విధులను శ్రద్ధాసక్తులతో చేయడం ద్వారా సమాజానికి పాటుపడాలని ఇందుకు తాలూకాలోని ఘంటంవారిపల్లి ప్రభుత్వ హైస్కూల్‌లో డి గ్రూప్ ఉద్యోగి రామచంద్రప్ప నిదర్శనమని ప్రధానోపాధ్యాయులు అభిప్రాయపడ్డారు. పదేళ్లుగా గ్రూప్ డి ఉద్యోగిగా సేవలందించి బదిలీ కావడంపై ఆత్మీయంగా సత్కరించారు. డి గ్రూప్ ఉద్యోగి అయినా అందరి అభిమానం పొందారని, సెకండ్‌గ్రేడ్ సహాయకులుగా పదోన్నతి పొంది మార్గానుకుంటెలోని అక్కమ్మసాకమ్మ ప్రభుత్వ హైస్కూల్‌కు బదిలీ అయ్యారు. రామచంద్రప్ప మాట్లాడుతూ అందరి అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు.

తండ్రి కలను నెరవేర్చిన కుమారుడు

» బంగారప్ప సహచరులను విమానంలో తిప్పిన మంత్రి

బెంగళూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి ఎస్ బంగారప్ప తన మిత్రులతో కలసి విమానంలో ప్రయాణించాలనే కల నెరవేరలేదు. రాష్ట్ర ప్రాథమిక విద్యాశాఖ మంత్రి మధుబంగారప్ప కొందరి ఆశను తీర్చారు. తండ్రి బంగారప్పతో సన్నిహితులుగా ఉండే సొరబ నియోజకవర్గానికి చెందిన 38మందిని శివమొగ్గ నుంచి బెంగళూరుకు విమానంలో ఆదివారం తీసుకొచ్చారు. మధు బంగారప్ప పుట్టినరోజును పురస్కరించుకుని తండ్రి అభిమానులు, సహచరులతో ఇండిగో విమానంలో ప్రయాణించారు.



శివమొగ్గ విమానాశ్రయంలో బంగారప్ప అభిమానులు

విజ్ఞానంతోనే ప్రగతి



ప్రశంసాపత్రాలతో విద్యార్థులకు సన్మానం

ముళబాగిలు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మనిషికీ, విజ్ఞానానికి అవినాభావ సంబంధం ఉందని తద్వారా సైన్సును జీవనంలో అలవరచుకోవడం ద్వారా సమాజంలో మాదిరి వాతావరణం నిర్మించుకోవడం సాధ్యమని జ్ఞాన-విజ్ఞాన సమితి అధ్యక్షుడు కేఎన్ తాయలూరప్ప పేర్కొన్నారు. హైదరినగర్‌లోని పాఠశాలలో ఏర్పాటైన సైన్స్‌డే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ యుగంలో శాస్త్రీయతను అలవరుచుకుని ప్రయోజనం పొందాలన్నారు. ప్రతి వ్యక్తి విద్యార్థిదశనుంచే శాస్త్రీయభావాలు అలవాటు చేసుకుంటే మూఢ నమ్మకాలకు అడ్డుకట్ట వేయవచ్చునన్నారు. అందుకుగాను పాఠశాల స్థాయిలో అందరికీ సైన్స్ గురించి అవగాహన కల్పించే వాతావరణం కల్పించాలన్నారు. ఇదే సందర్భంగా రాష్ట్రస్థాయిలో ఆన్‌లైన కార్యక్రమంలో విజేతలైన విద్యార్థులకు సమితి ఆధ్వర్యంలో బహుమతులు అందచేసి అభినందించారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షురాలు బి చిత్ర, సురేంద్ర, ఫక్రుద్దీన్ సాబ్, కోశాధికారి నటరాజ్, గౌరవ సలహాదారుడు కేబీ నాగరాజ్, ప్రధానోపాధ్యాయురాలు యాసిన్‌తాజ్ తదితరులు పాల్గొన్నారు.

మాదముత్తనహళ్ళి డెయిరీ కాంగ్రెస్ మద్దతుదారుల వశం



డెయిరీ నూతన పదాధికారులు

బంగారపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని హున్కుంద గ్రామపంచాయతీ పరిధిలోని మాదముత్తనహళ్ళి పాల డెయిరీ అధ్యక్షుడిగా కాంగ్రెస్ మద్దతుదారుడు ఎంఎస్ చలపతి, ఉపాధ్యక్షుడిగా వెంకటప్ప ఏకగ్రీవమయ్యారు. 15రోజుల క్రితం పాలడెయిరీ 12 స్థానాలకు డైరెక్టర్‌ల స్థానాలకు జరిగిన ఎన్నికల్లో అన్ని స్థానాలు కాంగ్రెస్ మద్దతుదారులు ఎమ్మెల్యే అనుచరులైన ఎంఎస్ చలపతి, వెంకటప్పల నేతృత్వంలో విజయం సాధించారు. తాజాగా అధ్యక్ష, ఉపాధ్యక్షస్థానాలకు జరిగిన ఎన్నికల్లో చలపతి, వెంకటప్పలు మాత్రమే నామినేషన్లు దాఖలు చేయడంతో ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారి బాలకృష్ణప్ప ప్రకటించారు. పాల డెయిరీ అధ్యక్ష, ఉపాధ్యక్షులను, డైరెక్టర్లను ఆదివారం ఆత్మీయంగా సత్కరించారు.

కార్యకర్తలకు అండగా ఉంటా



సమాజసేవకుడు పుట్టు అంజనప్ప తదితరులు

శిడ్లఘట్ట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సంబంధించి రానున్న తాలూకా, జిల్లా పంచాయతీ ఎన్నికల్లో బాధ్యతాయుతంగా పనిచేసే కార్యకర్తలకు తన సహకారం ఉంటుందని కాంగ్రెస్ నాయకుడు, సమాజ సేవకుడు పుట్టు ఆంజనప్ప అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలో జిల్లా యువ విభాగం కాంగ్రెస్ నాయకులను అభినందించి మాట్లాడారు. స్థానిక ప్రజల సమస్యలను పరిష్కరించేలా కార్యకర్తలు చొరవ చూపాలన్నారు. ఈ సందర్భంగా దర్శి రవి, రాకేశ్, చాంద్ బాషా, దేవరాజ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి భవన్ నుంచి చేనేత డిజైనర్‌కు ఆహ్వానం



నాగరాజు

ధర్మవరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి భవన్ నుంచి ఆహ్వానం వచ్చినట్టు ధర్మవరం పట్టణానికి చెందిన డిజైనర్, చేనేత కార్మికుడు నాగరాజు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేనేతకు ప్రోత్సాహం కల్పించడానికి అమృత్ మహోత్సవంలో భాగంగా ధర్మవరం పట్టుచీరల ప్రదర్శన కోసం రాష్ట్రపతి భవన్ నుంచి ఎక్స్‌పో నిర్వహణకు ఆదివారం ఆహ్వానం పంపించారని నాగరాజు తెలిపారు. గత ఏడాది ఆగస్టు 15న గవర్నర్ విందుకు ఆహ్వానం పంపగా హాజరయ్యానని పేర్కొన్నారు. దేశ రాజధానిలో ధర్మవరం పట్టుచీరల ప్రత్యేకతను తెలియజేయడం గర్వించదగ్గ విషయం అన్నారు. రాష్ట్రపతిభవన్‌కు తనతో పాటు చేనేత కార్మికుడు చిప్పల మార్కండేయ రానున్నట్టు వివరించారు.